క్లుప్తంగా

జీడిమామిడి రైతులకు శిక్షణ



జీడిమామిడి సాగుపై రైతులకు శిక్షణ ఇస్తున్న ఉద్యానశాఖ అధికారి మల్లికార్జునరావు

గోకవరం: జీడిమామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని వీరలంకపల్లి ప్రకృతి వ్యవసాయ క్షేత్రమైన రామకృష్ణాగార్డెన్స్‌లో బుధవారం జీడిమామిడి సాగుపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. బాపట్లకు చెందిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సిబ్బంది జీడిమామిడి సాగు చేస్తున్న రైతులకు సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ వీసీ వెంగయ్య, డాక్టర్ జె.ఫణికుమార్, బృహన్నగౌడ్, ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కేఈ చిన్నయ్యపాలెంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో ఆటో డ్రైవర్లకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ వేగం కన్నా మనిషి ప్రాణమే ముఖ్యమని గ్రహించి డ్రైవర్లు బాధ్యతగా వ్యవరించాలన్నారు. కాలం చెల్లిన వాహనాలు నడపకూడదన్నారు. ఆటోల్లో మితిమీరిన ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. హెల్మెట్, లైసెన్స్, పార్కింగ్ ఇబ్బందులు, ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించారు.

గో సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



గండేపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

గండేపల్లి: గో సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. ఈ మేరకు గండేపల్లి పంచాయతీ కార్యదర్శి కె. ఫణీంద్రకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా గోవధ జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరమళ్ల సూరిబాబు, గారపాటి సుబ్బారావు, ఐవీవీ లక్ష్మి, వి.ఉమ, ఎన్.కుమారి, డాక్టర్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్ తెలిపారు. ఏలేశ్వరం - జడ్డంగి అన్నవరం రోడ్డులో బుధవారం తమ సిబ్బంది రూట్‌వాచ్ నిర్వహించారన్నారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం గ్రామానికి చెందిన జుత్తుకు సుబ్రహ్మణ్యం స్కూటీపై 30 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నారు. స్కూటీ, సారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. కాగా సారా తయారీకి నల్లబెల్లం సరఫరా చేసిన రౌతు శ్రీనుపై కేసు నమోదు చేశామన్నారు. స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, మంగళగిరి స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.పైడిపాలలో 'తొలి అడుగు'

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్ రద్దుపై కృతజ్ఞతలు

జగ్గంపేట: ప్రభుత్వం లారీలకు గ్రీన్ ట్యాక్స్ రద్దు చేయడం పట్ల లారీ యూనియన్ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో గ్రీన్ ట్యాక్స్ వల్ల చాలా ఇబ్బందులు పడ్డామని లారీ యూనియన్ నేతలు తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ రద్దు సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జగ్గంపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మారిశెట్టి రాధ, యూనియన్ అధ్యక్షుడు దవులూరి ఈశ్వరరావు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.



అరకొర నీటి నిల్వలతో ఉన్న తాండవ జలాశయం



ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న వరి నారుమడి

సమస్యల తాండవం

- సాగునీటి కోసం ఆయకట్టు రైతుల అవస్థలు
- నీటి పెంపు సమస్యపై స్పందించని పాలకులు
- ఎండిపోతున్న నారుమడులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

కోటనందూరు: రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన తాండవ జలాశయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. జలాశయంలో అవసరం మేర సాగునీరు లేక రైతాంగం నిస్సహాయ స్థితిలో ఆకాశం వైపు చూస్తోంది. కాకినాడ-అనకాపల్లి జిల్లాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంచడంపై గత పాలకులెవరూ దృష్టి సారించలేదు. ఫలితంగా నేడు రైతన్నకు సాగునీటి సమస్య తలెత్తింది. కాలం కనికరించక, సాగునీరు అందుబాటులో లేక ప్రస్తుతం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. జూలై గడిచిపోతున్నా నారుమడులు వేసే పరిస్థితి లేకపోగా అక్కడక్కడా వేసిన నారుమడులు సైతం ఎండిపోతున్నాయి. జలాశయాన్ని సుదీర్ఘ కాలంగా పట్టి పీడిస్తున్న అనేక సమస్యలే ఈ దయనీయ స్థితికి కారణం. దశాబ్దాలుగా తాండవిస్తున్న సమస్యలను పరిష్కరించకపోతే సాగునీటి సమస్య ఎప్పటికీ తీరే పరిస్థితి లేదు. ఈ దుస్థితిపై నేటి పాలకులు దృష్టి సారించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

51,460 ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయ పరిధిలో అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 18,776 ఎకరాల చొప్పున మొత్తం 51,460 ఎకరాల ఆయకట్టు అధికారికంగా ఉండగా అనధికారికంగా మరో 18 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మేజర్, మైనర్ కాలువల ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది.

వేధిస్తున్న అదనపు జలాల సమస్య

తాండవ జలాశయంలో అదనపు జలాలు సమకూర్చాలని గత మూడు దశాబ్దాలుగా రైతులు చేస్తున్న ఉద్యమానికి రాజకీయ నాయకుల ప్రోత్సాహం ఏమాత్రం లేదు. దీనికి తోడు ఉన్న ఆయకట్టు చాలదన్నట్లు కాలువల పొడవును పెంచుకుంటూ పోతున్నారు. తాండవ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 4.4 టీఎంసీలు కాగా దీనిలో 0.4 టీఎంసీల నీరు డెడ్ స్టోరేజీగా ఉంటుంది. ఒక టీఎంసీ నీరు 8 వేల ఎకరాల వరి, 12 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సరిపోతుంది. ఈ లెక్కన తాండవ జలాశయం పూర్తిగా నిండితే కేవలం 32 వేల ఎకరాల వరి పంటకు మాత్రమే నీరు సరిపోతుంది. అధికారుల లెక్కల ప్రకారం 51, 460 ఎకరాల తాండవ ఆయకట్టు ఉండగా వాస్తవానికి ఆయకట్టు పరిధిలో 69 వేల ఎకరాల వరకూ సాగునీరు అందించాల్సి వస్తోంది. జలాశయం రెండుసార్లు నిండితే గాని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించే పరిస్థితి లేదు.

పూడిక పేరుకుపోయి..

జలాశయం ఏర్పడిన తరువాత పూడిక తీత పనులు ఇప్పటివరకూ చేపట్టలేదు. వరద వచ్చిన ప్రతిసారి క్యాచ్‌మెంటు ఏరియా నుంచి భారీగా ఒండ్రుమట్టి జలాశయానికి వచ్చి చేరుతుంది. దీనికి తోడు జలాశయ అంతర్భాగంలో నీరు లేని చోట సాగవుతున్న పంటల కారణంగా మట్టి కూడా వచ్చి చేరుతోంది. అనేక సంవత్సరాలుగా జలాశయంలోకి భారీగా వచ్చి చేరిన పూడిక నీటి నిల్వల సామర్థ్యానికి గండి కొడుతోంది.

పూడిక తొలగించాలి



తాండవ జలాశయంతో పాటు కాలువల్లో పూడిక తొలగించక పోవడంతో ఏటా సాగునీటి సమస్య తలెత్తుతోంది. పంట చి'వరి'లో వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, పంటలు ఎండిపోవడం పరిపాటిగా మారింది. అప్పుడు రైతులే స్వచ్ఛందంగా పూడిక తొలగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. టైలాండు రైతుల పరిస్థితి మరింత దయనీయం. ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.
కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

భారీగా ఆక్రమణలు

జలాశయం అంతర్భాగంలో చాలా వరకూ ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. నేతల ఒత్తిళ్లలో వాటిని గుర్తించి తొలగించడంలో అధికారులు చొరవ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాలువల గట్లు సైతం భారీగా ఆక్రమణలకు గురైనట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఆక్రమణలతో శివారు భూములకు సాగు నీరు అందడం లేదని టైలాండు ప్రాంత రైతులు వాపోతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జలాశయాన్ని సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. జలాశయ పరిధిలో ఉన్న ఐదు సెక్షన్లలో క్షేత్ర స్థాయి సిబ్బంది లష్కర్లు, వర్క్ఇనస్పెక్టర్ల కొరత అధికంగా ఉంది. ఈ కారణంగా నీటి నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యమని రైతులు వాపోతున్నారు.

ఇసుక అక్రమాలతో కట్టడాలకు ముప్పు

తాండవ నదిలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించడంలో అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఫలితంగా రైతులకు ప్రయోజనం చేకూర్చాల్సిన నదిలోని నీటి పంపిణీ కట్టడాలకు (గ్రోయిన్లు) ముప్పు వాటిల్లుతోంది. గ్రోయిన్ల మరమ్మతులకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఇసుక అక్రమాలతో కట్టడాలు నదిలో కొట్టుకుపోతున్నాయి.

దళిత సర్పంచ్‌పై రాజకీయ కక్ష తగదు

వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు



మురళీకృష్ణంరాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న పోతులూరు సర్పంచ్ రాంబాబు

ప్రత్తిపాడు రూరల్: దళిత సర్పంచ్‌పై రాజకీయ కక్ష సాధింపు తగదని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని పోతులూరు గ్రామ సర్పంచ్ బోండు రాంబాబుపై రాజకీయ కక్షలో భాగంగా అవినీతి ముద్రవేసి చెక్ పవర్‌ను రద్దు చేశారు. దీనిపై మురళీకృష్ణంరాజు సహకారంతో రాంబాబు హైకోర్టులో న్యాయ పోరాటం చేశారు. వాదనలు అనంతరం న్యాయమూర్తి చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ తీర్పు నిచ్చారు. ఈ సందర్భంగా తనకు అన్ని విధాలా సహకరించిన మురళీకృష్ణంరాజును సర్పంచ్ బోండు రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్యాయం జరిగితే తాను అండగా ఉంటానని మురళీకృష్ణంరాజు భరోసా ఇచ్చారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, సమీపంలో చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే చర్యలు



కాకరాపల్లిలో తుని-నర్సీపట్నం రోడ్డును ఖాళీ చేయిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: తుని-నర్సీపట్నం రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్, కాకరాపల్లిలో రోడ్డును ఆక్రమించిన వ్యాపార సముదాయాలపై బుధవారం దాడులు నిర్వహించారు. దగ్గరుండి వ్యాపారులతో రోడ్డును ఖాళీ చేయించారు. మరోమారు రోడ్డును ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తుని-నర్సీపట్నం రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులదేనన్నారు. దుకాణాల ముందు వాహనాలు నిలిపినా, రోడ్డును ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



తునిలో మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

తుని: మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైల్వే ప్రొటెక్షన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటస్వామి సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే పోలీసు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, క్రాప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాల కోసమే మానవ అక్రమ రావాణా సాగుతోందన్నారు.

ఉపాధి కల్పిస్తామని బలవంతంగా పనుల్లో పెట్టుకోవడం, బాల్య వివాహాలు చేసుకోవడం నేరమన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాలు, నిరక్షరాస్యులు, వయస్సులో ఉన్న స్త్రీలు, చిన్నపిల్లలు అక్రమ రవాణ బారిన పడుతున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణా నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రాప్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో మృత్యుంజయ హోమం చేస్తున్న ముద్రగడ పద్మావతి తదితరులు



రౌతులపూడి కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాచపల్లిలోని అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఏలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దాడిశెట్టి నుకాపతి దంపతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ హోమంలో ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె భర్త ముద్రగడ పద్మనాభం ఆయుఆరోగ్యాలతో తిరిగి ఇంటికి రావాలని స్వామి వారిని వేడుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు ముద్రగడ పద్మావతికి వేద ఆశీస్సులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి కాశీ, రామిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.



సోమవరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాస-శివరాత్రి కమిటీ సభ్యులు

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ మండలంలోని ఆ పార్టీ శ్రేణులు బుధవారం స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి ముద్రగడ ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ముద్రగడ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వాసిరెడ్డి భాస్కరబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చెన్నాడ భీమరాజు, సర్పంచులు రాపర్తి రామకృష్ణ, సర్నం శ్రీను, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, పార్టీ నాయకుడు సోమరౌతు తిరుముల వెంకన్నదొర, పార్టీ జిల్లా కార్యదర్శి అంకంరెడ్డి సతీష్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, పార్టీ యూత్ కమిటీ అధ్యక్షుడు సోమరౌతు రాజా, మండల బీసీ సెల్ అధ్యక్షుడు సింగంపల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులు(పీఏసీ) ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ బుధవారం ఆ పార్టీ శ్రేణులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి కమిటీ సభ్యులు సోమవరం గ్రామ శివాలయంలో రుద్రాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వం-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. మండలంలోని చినశంకర్లపూడిలో గురువారం పీ 4 సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్ బాబు మాట్లాడుతూ ఉద్యోగులతో పాటు గ్రామంలో ఆర్థిక వెసులుబాటు ఉన్న వ్యక్తులు బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. గ్రామంలో పీ 4 సర్వేలో ఎంపికైన కుటుంబాల జాబితాలో మార్పులు, చేర్పులు, ఆయా కుటుంబాల అభివృద్ధికి సలహాలు, ఉపాధి కల్పనకు సూచనలు అందించాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు, మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, కార్యదర్శి బి.వీరబాబు, అసెంబ్లీ విజన్ యాక్షన్ ప్లాన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కత్తిపూడిలో ఫారం పాండ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండ్ పనులను బుధవారం కలెక్టర్ షణ్మోహన్ సగలి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. ఫారం పాండ్ గట్లపై కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫారం పాండ్ పనుల చేపట్టిందన్నారు. సేద్యపు గుంతలతో రైతులకు నీటి ఎద్దడి సమస్య తీరుతుందన్నారు. భూమిలో నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని తెలిపారు. కంపోస్టు పిట్‌ల నిర్మాణం చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలు రోజుకు సగటు రూ.300 పొందేలా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాతారావు, ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

గండేపల్లి: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డీపీఓ వి.రవికుమార్ కోరారు. గండేపల్లి, మల్లేపల్లిలో తడి, పొడి చెత్త సేకరణను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కె.చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎన్ శ్రీనివాస్, డీపీఆర్సీ గణేష్, కార్యదర్శి కేవీఆర్ ఫణీంద్ర కుమార్, తదితరులు ఉన్నారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు కీలకం

- సాగులో మెళకువలపై రైతులకు అవగాహన
- గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు



కొలిమేరులో రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు



పెద్దనాపల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుబ్బారావు

తుని రూరల్: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతుల కీలకమని మండల వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ శివకుమారి అన్నారు. కొలిమేరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆరుతడి పంటలు, చిరుధాన్యాల సాగు, కౌలు కార్డుల ఆవశ్యకత, ఖరీఫ్‌లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో రైతులను కలిశారు. వరినారు మడులను పరిశీలించిన ఏఈఓ ఉచితంగా అపరాలు, చిరుధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలుదారులు సీసీఆర్‌సీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో వరి నాట్లు వేసే రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పరిమితికి మించి ఎరువులు వాడొద్దనన్నారు. ఉద్యాన సహాయకురాలు ప్రియా దీప్తి, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి కీలకం

కోటనందూరు: వరి సాగులో తెగుళ్లను నివారించాలంటే విత్తనశుద్ధి కీలకమని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వరి విత్తనాలు సుడోమోనాస్ పౌడర్‌తో కలిపి విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ల నివారణతో పాటు మంచి దిగుబడులు వస్తాయన్నారు. వరిలో నీరు, ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మినుములు, కంది విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు విధిగా బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు చేయించుకోవాలి

ఏలేశ్వరం: రైతులు పంటల బీమా నమోదు చేయించుకోవాలని వీఏఏ దాడిశెట్టి భువనేశ్వరి సూచించారు. మండలంలోని భద్రవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి సాగుకు ఇన్సూరెన్సు చేయించుకోవాలన్నారు. వరి గట్లపై నాటుకోవడానికి కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు చేతుల మీదుగా రైతులు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్ ఆనంద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రత్తిపాడు రూరల్: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ మాలకొండయ్య అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ నేలలో సేంద్రియ కర్బనం ఎలా పెంచుకోవాలో రైతులకు వివరించారు. వరి గట్లపై కంది సాగును ప్రోత్సహించేందుకు కంది, మినుము విత్తన మినీ కిట్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒమ్మంగి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు కటకం సాయి గణేష్, యు.మల్లిక, ఒమ్మంగి సొసైటీ చైర్మన్ సత్యం శెట్టి సీతబాబు, ఏఎంసీ డైరెక్టర్ సుంకర సోమరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

రౌతులపూడి: కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని వ్యవసాయ, ఉద్యానవన సిబ్బందికి గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు మండల ఏఓ రెడ్డి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఇస్తామన్నారు. ఆయా మండలాల్లోని వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రైతులకు చిరుధాన్యాల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. రాఘవపట్నంలో వ్యవసాయశాఖ అధికారులు రాగులు, సజ్జల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సాగులో మెళకువలు వివరించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

గండేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యానికి సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేసినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. భీమవరానికి చెందిన రెండున్నర సంవత్సరాల బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రూ.68000 బాలుడి బంధువులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బీవీ వీరాంజనేయులు పాల్గొన్నారు.



బాలుడి బంధువులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రో చాన్సలర్ శ్రీనివాసరెడ్డి

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నర్సీపట్నం రోడ్డు-గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 50 ఏళ్లున్న వ్యక్తి రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుడిచేతిపై పచ్చబొట్టుతో దుర్గ అని హిందీలో రాసి ఉంది. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు.